
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం | 19 | మే | 2024

వేంకటేశ్వరునికి వెండి కిరీటం



అంబాజీపేట: స్థానిక కొర్ల పాటివారిపాలెంలో భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి బండారులంక లేఅవుట్ సిండికేట్ సభ్యులు, భక్తుల ఆధ్వర్యంలో రూ.1.10 లక్షల విలువైన వెండి కిరీటాన్ని శనివారం సమర్పించారు.



నిండు ప్రాణాలు.. గోదారమ్మ ఒడిలోకి..

రావులపాలెం వద్ద గౌతమీ గోదావరిలో స్నానానికి వెళ్లిన యువకుల్లో ముగ్గురు గల్లంతయ్యారు. వారిలో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మరొకరి ఆచూకీ తెలియాల్సి ఉంది. - 8లో

గరిష్టం/కనిష్టం
38.0° / 26.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	33.0	26.0
కాకినాడ	36.5	26.2
అమలాపురం	38.0	26.0

న్యూస్‌రీల్

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పార్కింగ్ స్థలాల ఎంపిక



పార్కింగ్ స్థలాలను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా, ఎస్పీ శ్రీధర్

అమలాపురం రూరల్: వచ్చే నెల 4న సాధారణ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల చుట్టుపక్కల పార్కింగ్ ప్రదేశాలను ఎంపిక చేస్తున్నామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. శనివారం చెయ్యేరులో శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల చుట్టుపక్కల ప్రభుత్వ సిబ్బంది, ప్రజాప్రతినిధుల వాహనాల పార్కింగ్ కోసం నాలుగు స్థలాలను ఎంపిక చేశారు. ఈ కళాశాలలో అమలాపురం పార్లమెంట్ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా ఎస్పీ శ్రీధర్‌తో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు అనుబంధంగా ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను వారు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు రోజున శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వద్ద ట్రాఫిక్ మళ్లించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. అమలాపురం ఆర్డీఓ, అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి జి.కేశవర్ధన్‌రెడ్డి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఎస్.మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల నాలుగు వరకూ 144 సెక్షన్

శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఈ నెల 14 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. సాధారణ ఎన్నికల పోలింగ్ 13న నిర్వహించి, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచారన్నారు. అక్కడ కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్నందున ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతను దృష్టిలో ఉంచుకుని 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు వివరించారు.

చూసిన కన్నులదే భాగ్యం



అప్పనపల్లిలో అన్న ప్రసాదం కౌంటర్ వద్ద బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: నిత్య కల్యాణం, పచ్చ తోరణంగా విరాజిల్లుతున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారిని శనివారం భక్తులు తనివి తీరా దర్శించుకుని పులకించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన స్వామివారి దివ్య మంగళ స్వరూపం దర్శనంతో మురిసిపోయారు. వేసవి సెలవులు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. భక్తుల రాకతో పాత గుడితో పాటు కొత్త గుడి రద్దీగా మారింది. స్వామివారికి వివిధ సేవల ద్వారా రూ.4.31 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.3.15 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. నిత్యాన్నదాన ట్రస్టుకు భక్తులు రూ.1,15,603 విరాళాలుగా సమర్పించారన్నారు. 4,193 మంది స్వామివారిని దర్శించుకున్నారని, 3,278 మంది అన్న ప్రసాదం స్వీకరించారన్నారు. కాకినాడకు చెందిన దూనబోయిన నాగమల్లేశ్వరరావు, కోమలి దంపతులు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.10,116 విరాళంగా అందించారు. ఇదిలా ఉంటే అప్పనపల్లి ఆలయంలో హుండీల ఆదాయం లెక్కింపు ఈ నెల 22వ తేదీ బుధవారం జరుగుతుందని ఈఓ మాధవి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: మందపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. స్వామివారి ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులు తైలాభిషేకాలు, సర్వదర్శనాలు చేసుకున్నారు. దేవస్థానం ఏసీ అండ్ ఈఓ కె.విజయలక్ష్మి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ. 1,75,310, అన్నప్రసాద పథకానికి విరాళాల రూపంలో మరో రూ.68,548 వచ్చాయి. సిబ్బంది, పలువురు గ్రామస్తులు అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు.

బడి బస్సెంత భద్రం ?



- ముగిసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు
- కొత్తగా జారీ ప్రక్రియ ప్రారంభం
- ప్రతి బస్సుకూ స్పీడ్ గవర్నర్లు తప్పనిసరి


రాయవరం: బడి బస్సుల భద్రతపై అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది.. వచ్చే నెల 12 నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పటి నుంచే ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. జిల్లాలో వివిధ రకాల ప్రైవేట్ విద్యా సంస్థలు 580 వరకూ ఉన్నాయి. ఆయా విద్యా సంస్థల విద్యార్థులు అధిక శాతం బస్సుల్లోనే ప్రయాణిస్తుంటారు. అయితే బస్సు సామర్థ్యం సరిగ్గా లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశముంది. అందుకే ఏటా మోటార్ వెహికల్ తనిఖీ అధికారులు బస్సు కండీషన్ చెక్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంటారు. గతేడాది జారీ చేసిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ గడువు ఈ నెల 15వ తేదీతో ముగియడంతో, 17వ తేదీ నుంచి కొత్తగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభమైంది. విద్యార్థులను సురక్షితంగా ఇంటి నుంచి పాఠశాలలకు, పాఠశాల నుంచి ఇంటికి చేరవేసే వాహనాల సామర్థ్యం (ఫిట్‌నెస్) ఎలా ఉందన్న విషయాన్ని తేల్చే పనిని రవాణా శాఖ అధికారులు చేపడుతున్నారు.

ఆన్‌లైన్‌లో తేదీల ఖరారు

జిల్లాలోని స్కూళ్లు, కళాశాలల బస్సుల సామర్థ్య పరీక్షలు చేపట్టడానికి మండపేట, రామచంద్రపురం, అమలాపురం రవాణా శాఖ కార్యాలయాలు సన్నద్ధమయ్యాయి. వాహనాలు ఎలా ఉండాలనే విషయమై పాఠశాల, కళాశాలల యాజమాన్యాలకు ఇప్పటికే తెలియజేశారు. వాహన ఫిట్‌నెస్ ధ్రువీకరణ కోసం ముందుగా ఆన్‌లైన్లో పాఠశాల/కళాశాలల యాజమాన్యాలు ఈ–ప్రగతి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలి. అనంతరం రవాణాశాఖ కార్యాలయానికి ఎఫ్‌సీ చేయించుకునేందుకు ఓ తేదీని కేటాయిస్తారు. ఆ ప్రకారం వాహనాన్ని రవాణా శాఖ కార్యాలయానికి తీసుకొస్తే, అందరి సమక్షంలో వాహన ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహిస్తారు.

జిల్లాలో మొత్తం 791 బస్సులు

జిల్లాలో 791 వరకూ పాఠశాల, కళాశాలల బస్సులు ఉన్నాయి. మండలాల వారీగా పరిశీలిస్తే.. మండపేట 83, ఆలమూరు 21, కపిలేశ్వరపురం 8, రావులపాలెం 59, మలికిపురం 41, రాజోలు 45, పి.గన్నవరం 10, సఖినేటిపల్లి 19, మామిడికుదురు 50, ఆత్రేయపురం 6, రామచంద్రపురం 61, రాయవరం 12, కె.గంగవరం 10, అమలాపురం 263, ముమ్మిడివరం 18, అల్లవరం 41, ఉప్పలగుప్తం 5, ఐ.పోలవరం 11, అంబాజీపేట 7, కాట్రేనికోన 9, కొత్తపేట 9, అయినవిల్లి 5 బస్సులు ఉన్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా పాఠశాల/కళాశాల వాహనాలు రోడ్డుపై తిరగడానికి వీలులేదు. 2017 నుంచి స్కూల్ బస్సులకు స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటు చేసుకోవడం తప్పనిసరి చేశారు. ఈ బస్సుల వేగం గంటకు 60 కిలోమీటర్లు మాత్రమే ఉండాలి.



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారి (ఫైల్)

క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం



కళాశాలలు, పాఠశాలల వాహనాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వస్తున్నాయి. ప్రతి బస్సును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాం. విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న ఈ బస్సుల భద్రత విషయంలో రాజీపడే ప్రసక్తి లేదు. యజమానులూ వాహనాల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిచ్చి, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చేయించుకోవాలి.

–ఆర్.రాజేంద్రప్రసాద్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, రామచంద్రపురం

కండీషన్‌లో లేకుంటే సీజ్



ప్రతి స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. అలాగే స్పీడ్ గవర్నర్స్ ఏర్పాటు చేసుకోవాలి. వచ్చే నెల 15వ తేదీ లోపు ఎఫ్‌సీ చేయించుకోవాలి. పాఠశాలలు తెరిచిన నాటి నుంచి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. గడువు ముగిసిన తర్వాత ఎఫ్‌సీ, పర్మిట్, కండీషన్ లేని బస్సులను సీజ్ చేస్తాం.

– డి.అశోక్ ప్రతాప్‌రావు, డీటీఓ, అమలాపురం

ఇవి పాటించాల్సిందే..

- పాఠశాల బస్సును నడిపే డ్రైవర్‌కు బీపీ, షుగర్, కంటి సంబంధిత సమస్యలు లేవని సర్టిఫికెట్ సమర్పించాలి.
- బస్సుకు సంబంధించిన అన్ని లైట్లు పనిచేయాలి. రిఫ్లెక్టివ్ టేపును బస్సుకు నాలుగు వైపులా అతికించాలి. బస్సుకు ఉన్న గ్లాసులన్నీ పటిష్టంగా ఉండేలా చూడాలి.
- బస్సు నుంచి అధిక మొత్తంలో బ్లాక్ స్మోక్ (పొగ) రాకుండా చూసుకోవాలి. బ్రేక్ కండిషన్‌లో ఉండాలి. హ్యాండ్ బ్రేక్, స్పీడో మీటర్ సక్రమంగా పనిచేయాలి. స్టీరింగ్, టైర్ల కండీషన్ సరిచూసుకోవాలి.
- బస్సు నడిపే డ్రైవర్‌కు ఐదేళ్ల అనుభవం, 60 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి.
- బస్సులో అత్యవసర ద్వారం, మంటలను ఆర్పే పరికరం ఏర్పాటు చేసుకోవాలి. అత్యవసర ద్వారం అని తెలిసేలా స్పష్టంగా కనిపించే విధంగా రాయించాలి.
- ప్రతి బస్సులో మందులు, పరికరాలతో కూడిన ప్రథమ చికిత్స బాక్స్‌ను అందుబాటులో ఉంచాలి. వారానికి ఒకసారి ప్రిన్సిపాల్ లేదా సంబంధిత అధికారి ఈ బాక్స్‌ను తనిఖీ చేయాలి. నెలకొకసారి పేరెంట్స్ కమిటీ చూసి, దీనికోసం ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలి.
- బస్సులో సీట్ల కింద బ్యాగులు ఉంచుకునేందుకు అరలు ఏర్పాటు చేయాలి. సైడ్ విండోలకు మధ్యలో మూడు అంగుళాలకు మించని దూరంలో అడ్డంగా మూడు లోహపు కడ్డీలు అమర్చాలి. ప్రతి విద్యా సంస్థ యాజమాన్యం, ట్రాన్స్‌పోర్ట్, పోలీస్, విద్యాశాఖల సౌజన్యంతో విద్యార్థులకు ఏడాదికి ఒకరోజు రోడ్ సేఫ్టీ తరగతులు నిర్వహించాలి.
- బస్సు ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు భూమి నుంచి 325 మి.మీ ఎత్తుకు మించరాదు. మెట్లు జారకుండా ఉండేలా లోహంతో చేయించాలి.
- బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందు తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్‌లు ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు బస్సు అటెండెంట్ పర్యవేక్షించాలి.
- పాఠశాల వద్ద బస్సుల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి. బస్సులో అటెండర్ ఉండాలి.
- సీటింగ్ కెపాసిటీకి మించి విద్యార్థులను ఎక్కించకూడదు. బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు, స్కూల్ బాయ్ అండ్ గర్ల్ ఇమేజ్ పొందుపర్చాలి.
- బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాల రూట్ ప్లాన్ ఉంచాలి. విద్యార్థుల సంఖ్య, వారి పూర్తి వివరాలు, అలాగే డ్రైవర్ వివరాలు బస్సులో ఏర్పాటు చేయాలి.
- ప్రతి నెలా బస్సు కండీషన్‌ను యాజమాన్యాలు, పాఠశాల పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలి. బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉంచాలి.
- బస్సులో అటెండర్ తప్పకుండా యూనిఫామ్ ధరించాలి.
- వెనుక నుంచి వచ్చే వాహనాలను చూసేందుకు వీలుగా బస్సు డ్రైవర్‌కు కుడి, ఎడమ వైపు బయట, లోపల మిర్రర్స్ ఏర్పాటు చేయాలి. బస్సు ఎట్టి పరిస్థితుల్లో ర్యాంగ్ రూట్‌లో ప్రయాణించరాదు.

భక్తవత్సలా గోవింద..

- వాడపల్లికి భక్తజన శోభ
- ఒక్కరోజే రూ.38.41 లక్షల ఆదాయం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం: వేసే ప్రతి అడుగులోనూ భక్తిపరవశమే.. పెదవి నుంచి వచ్చే ప్రతి మాటలోనూ గోవింద నామస్మరణమే.. ఏడు సార్లు ఆ స్వామి ఆలయం చుట్టూ చేసే ప్రదక్షిణలతో ప్రతి మది నిండా సంబరమే.. కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం వేలాది మంది భక్తజనం మధ్య మురిసిపోయింది. ఎక్కడ చూసినా కిక్కిరిసిన జనంతో పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కనిపించాయి. గోవింద నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. తొలుత వాడపల్లి వెంకన్న స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయమే భక్తులు గౌతమీ గోదావరిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారితో పాటు ఆలయ ఆవరణలో అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని దర్శించుకుంది. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. స్వామి వారికి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ ద్వారా సుమారు రూ.38,41,181 ఆదాయం సమకూరిందని ఈఓ తెలిపారు. ఆలయం వద్ద స్వామివారి అన్నప్రసాదాన్ని వేలాది భక్తులు స్వీకరించారు. రద్దీ దృష్ట్యా ఎటువంటి ఇబ్బంది రాకుండా ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.



ఆలయం వద్ద భక్తుల రద్దీ

ఇంటర్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

- మోడల్ స్కూల్స్‌లో విద్యకు దరఖాస్తులు
- ఆన్‌లైన్ ప్రక్రియకు ఈ నెల 22 చివరి తేదీ

రాయవరం: గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమాన్ని అందించాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదర్శ పాఠశాలల (మోడల్ స్కూల్స్)ను ఏర్పాటు చేశాయి. ఇందులో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి శంఖవరం, హంసవరంలో రెండు మోడల్ స్కూల్స్ ఉన్నాయి. మోడల్ స్కూల్స్‌లో 2024–25 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకూ తరగతులు నిర్వహిస్తుండగా, ఇప్పటికే ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేయగా, దరఖాస్తు ప్రక్రియ పూర్తయ్యింది. ఎంపిక జాబితా విడుదల కావాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఇంటర్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల కాగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఈ నెల 22 చివరి తేదీ అని పేర్కొన్నారు.

మొత్తం ఎన్ని సీట్లంటే..

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్‌కు ఒక్కో స్కూల్‌లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఒక్కో స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్‌కు 160 సీట్లను భర్తీ చేస్తారు. ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 ఫీజు చెల్లించాలి. దరఖాస్తు తుది గడువు ముగిసిన అనంతరం రాష్ట్ర కార్యాలయం నుంచి ఈ నెల 23న వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆయా జిల్లాలకు దరఖాస్తులు పంపిస్తారు. ఆన్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తుల నుంచి మెరిట్ జాబితాను ఈ నెల 24న తయారు చేస్తారు. జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ వైస్ చైర్మన్‌గా, సభ్యులుగా ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్ఐఓ, ఏపీ మోడల్ స్కూల్స్ ఏడీ ఉంటారు. మెంబర్ కన్వీనర్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్‌తో నామినేట్ చేయబడిన ప్రిన్సిపాల్ ఉంటారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను కమిటీ ఈ నెల 25న ప్రకటిస్తుంది. పాఠశాల స్థాయిలో ఈ నెల 27న ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తారు. జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. ఎంపికలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తారు. ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు ఆరు శాతం, బీసీలకు 29, ఓసీలకు 40, ఈడబ్ల్యూఎస్‌కు 10 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తారు.

దరఖాస్తులు హెచ్‌టీటీపీఎస్://ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లభ్యమవుతాయి. ఈ నెల 22వ తేదీలోగా నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డులను ఉపయోగించి గేట్‌వే ద్వారా అప్లికేషన్ రుసుం చెల్లించిన తర్వాత దరఖాస్తుదారులకు ఒక జనరల్ నంబరును కేటాయిస్తారు. జనరల్ నంబరు ఆధారంగా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇతర వివరాలకు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ను లేదా సంబంధిత డీవైఈఓ/మండల విద్యాశాఖాధికారిని సంప్రదించాలి.



ఏర్పాట్లు షురూ..

- ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం
- ఈ నెల 24 నుంచి 31 వరకూ నిర్వహణ
- జిల్లాలో 8,748 మంది విద్యార్థులు

రాయవరం: ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఈ నెల 24 నుంచి ప్రారంభం కానున్న ఈ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లలో నిమగ్నమైంది. జిల్లా వ్యాప్తంగా 21 కేంద్రాల్లో ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించనుంది. మధ్యాహ్నం పరీక్షలను ప్రభుత్వ కళాశాలలు ముమ్మిడివరం, ముక్తేశ్వరం, మామిడికుదురు, రాజోలు, కొత్తపేట, రావులపాలెం, ఆలమూరు, మండపేట, రాయవరం, రామచంద్రపురం, పామర్రుతో పాటు మలికిపురం ఏఎఫ్‌డీటీ జూనియర్ కళాశాల, పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాల, అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలల్లో మాత్రమే నిర్వహిస్తారు. మొత్తం 8,748 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఫస్టియర్, సెకండియర్ జనరల్ 7,733, ఒకేషనల్ ఫస్టియర్, సెకండియర్ 1,015 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఫస్టియర్ జనరల్ 6,438, సెకండియర్ జనరల్ 1,295, ఒకేషనల్ ఫస్టియర్ 696, సెకండియర్ 319 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. 12 ప్రభుత్వ, ఒక ఎయిడెడ్, 8 ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే కళాశాలల్లో పరీక్షలు తప్పిన, అత్యున్నత మార్కులను పొందేందుకు బెటర్‌మెంట్ కట్టిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.



పకడ్బందీ చర్యలు

పరీక్షలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు సంబంధించి సిబ్బందిని నియమించారు. 21 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్లను నియమిస్తున్నారు. స్టోరేజ్ పాయింట్లలో ప్రశ్నపత్రాలను భద్రపర్చనున్నారు. డీవీఈఓ, హైపవర్ కమిటీ, సిటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వీటి ద్వారా ఇంటర్‌బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షించేలా స్ట్రీమింగ్ చేశారు.

రెండు సెషన్లలో..

ఈ నెల 24 నుంచి 31వ తేదీ వరకూ జరిగే పరీక్షలను రెండు సెషన్లుగా నిర్వహిస్తున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ పరీక్షలు జరగనున్నాయి. విద్యార్థులు వారికి కేటాయించిన కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాల్సి ఉంటుంది. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. అలాగే పరీక్ష కేంద్రాల్లో అవసరమైన వైద్య సిబ్బందిని నియమిస్తున్నారు.

త్వరలో సమన్వయ సమావేశం

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ హిమాన్షు శుక్లా నేతృత్వంలో త్వరలో అమలాపురంలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నారు. ఇందులో ఇంటర్ బోర్డు అధికారులతో పాటు, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, పోలీసు, పోస్టల్, రెవెన్యూ, మున్సిపల్, డీఈఓ, డీపీవో తదితర ఎనిమిది శాఖలతో కూడిన సమావేశం జరగనుంది. ప్రధానంగా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా డెస్క్‌లు, తాగునీరు, టాయిలెట్లు తదితర సౌకర్యాలను కల్పించే అంశంపై సమీక్షించనున్నారు. ముఖ్యంగా మండుతున్న ఎండలకు విద్యార్థులు అవస్థలు పడకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని చర్యలు చేపడుతుంది.

పరీక్షల టైమ్‌టేబుల్ ఇదీ

తేదీ	ఫస్టియర్/సెకండియర్
24	సెకండ్ లాంగ్వేజ్
25	ఇంగ్లిషు
27	గణితం, బోటనీ, సివిక్స్
28	మేథ్స్, జువాలజీ, హిస్టరీ
29	ఫిజిక్స్, ఎకనామిక్స్
30	కెమిస్ట్రీ, కామర్స్ సోషియాలజీ, మ్యూజిక్
31	పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జికోర్సు, మేథ్స్

ప్రశాంత వాతావరణంలో..



విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. ముఖ్యంగా మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాం. మండుతున్న ఎండల నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తాం.

– వనుము సోమశేఖరరావు, ఇంటర్మీడిమెట్ జిల్లా విద్యాశాఖ అధికారి, అమలాపురం

బహిరంగ మార్కెట్‌లో పెట్రోల్ విక్రయాల నిషేధం

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ పెట్రోలియం ప్రోడక్ట్ ఆర్డర్ 1980 ప్రకారం పెట్రోల్ బంకుల్లో మోటార్ సైకిల్స్, వెహికల్స్ ట్యాంకుల్లో కాకుండా విడిగా సీసాలు, క్యాన్లు, ఇతర పరికరాల్లో పెట్రోల్ నింపడం నిషేధమని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ ఎల్లారావు అన్నారు. ఈ మేరకు పెట్రోలియం ప్రోడక్ట్ డీలర్లకు శనివారం ఆదేశాలు ఇచ్చారు. పెట్రోల్ బంకుల్లో కాకుండా ఇతర దుకాణాలు, బహిరంగ ప్రదేశాల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకం నిషేధమని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

శృంగార వల్లభునికి రూ.4.04 లక్షల ఆదాయం

పెద్దాపురం: తొలి తిరుపతి గ్రామంలో వేంచేసిన శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు 15 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుని, ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. దర్శనం, కేశఖండన టికెట్లు, అన్నదానం విరాళాల ద్వారా స్వామి వారికి రూ.4,04,592 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధికారి వడ్డి శ్రీనివాస్ తెలిపారు. ఆయనతో పాటు ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు ఆధ్వర్యాన భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానంతో పాటు మజ్జిగ కూడా అందించామని ఈఓ తెలిపారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యే వేగుళ్లపై అట్రాసిటీ కేసు

కపిలేశ్వరపురం: మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ, వల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వల్లూరి వీర్రాజు (వీరబాబు)లపై శుక్రవారం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు. తమను నిందితులు ముగ్గురూ కులం పేరుతో దూషించారంటూ వల్లూరు గ్రామానికి చెందిన ముగ్గురు విడివిడిగా పోలీసులకు ఫిర్యాదులు చేయడంతో కేసులు నమోదయ్యాయి. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజున వైఎస్సార్ సీపీ అభ్యర్థి తరఫున పోలింగ్ ఏజెంట్‌గా ఉన్న తనను ఎమ్మెల్యే జోగేశ్వరరావు, లీలాకృష్ణ, వీరబాబులు కులం పేరుతో దూషించారంటూ రోకేష్ ఫిర్యాదు చేశారు. పోలింగ్ రోజున జరిగిన దాడిని అడ్డుకోగా తనను కులం పేరుతో వారు దూషించారంటూ అదే గ్రామానికి చెందిన నక్కా భాస్కరరావు మరో ఫిర్యాదు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తావా అంటూ ఆ ముగ్గురూ కులం పేరుతో దూషించారంటూ బుర్రిలంకలో ఉంటున్న వల్లూరుకు చెందిన నక్కా అమ్మిరాజు ఫిర్యాదు ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

నిడదవోలు రూరల్: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ శనివారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. నిడదవోలు మండలం తాడిమళ్ల గ్రామానికి చెందిన దిరిసిమిల్లి పోతురాజు (47)కు కంసాలిపాలెం గ్రామానికి చెందిన నాగలక్ష్మికి కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొంతకాలంగా భార్య, పిల్లలు తన వద్ద ఉండటం లేదని మనస్థాపానికి గురైన పోతురాజు శనివారం ఉదయం పురుగు మందు తాగాడు. అతన్ని వెంటనే వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పోతురాజు మృతి చెందినట్లు భార్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


మృతుడు ఈశ్వర్‌రెడ్డి (ఫైల్)


మృతుడు జయకుమార్ (ఫైల్)


గల్లంతైన సంపత్‌రెడ్డి (ఫైల్)


ప్రమాద స్థలంలో ఈశ్వర్‌రెడ్డి, జయకుమార్ మృతదేహాలు


ఒడ్డున కూర్చున్న సత్యనారాయణరెడ్డి

నిండు ప్రాణాలు.. గోదారమ్మ ఒడిలోకి..

- ఉసురు తీసిన ఈత సరదా
- నదిలో స్నానానికి దిగి ఇద్దరి మృతి
- మరో యువకుడి గల్లంతు


గోదావరిలో గాలిస్తున్న స్థానికులు, అధికారులు

రావులపాలెం: ఈత సరదా.. నిండు ప్రాణాలనే మింగేసింది. అప్పటి వరకూ ఆనందంగా గడిపిన వారిని అనంత లోకాలకు తీసుకెళ్లింది.. యువకుల మృతి ఘటన ఆయా కుటుంబాల్లో పుట్టెడు శోకాన్ని మిగిల్చింది.. రావులపాలెం వద్ద గౌతమి పాత బ్రిడ్జి సమీపంలో శనివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. సీఐ ఎం.ఆంజనేయులు కథనం ప్రకారం.. రావులపాలెం చిన్న వంతెన సమీపంలో నివాసం ఉంటున్న సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలు అన్నదమ్ములు. వీరికి వరుసకు తమ్ముడయ్యే, పిన్ని కొడుకు సత్తి సంపత్‌రెడ్డి విజయనగరం నుంచి వేసవి సెలవులకు పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. ఈ ముగ్గురితోపాటు స్థానికులైన మరో ఇద్దరు పెంట జయకుమార్, కొమ్మర్తి రాజేష్ మొత్తం ఐదుగురు కలసి సాయంత్రం సమయంలో గోదావరిలో స్నానం చేసేందుకు స్థానిక గౌతమి నది వద్దకు వెళ్లారు. పాత బ్రిడ్జి సమీపంలో నదీ ప్రవాహం వద్దకు చేరుకుని సత్యనారాయణరెడ్డి మినహా మిగిలిన నలుగురూ స్నానానికి దిగారు. సత్యనారాయణరెడ్డికి ఈత రాకపోవడంతో ఒడ్డున సెల్‌ఫోన్ చూసుకుంటూ కూర్చున్నాడు. కొంత సమయానికి రాజేష్ కంగారుగా ఒడ్డుకు రావడంతో ఏమైందని అడిగాడు. నదీ ప్రవాహంలో ముగ్గురు కొట్టుకుపోయారని చెప్పడంతో అక్కడ ఉన్న మరో ఇద్దరి సహాయంతో గోదావరిలో గాలించారు. ఎంతకీ ప్రయోజనం లేకపోవడంతో ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్లో తెలిపారు. దీంతో సమాచారం అందుకున్న బంధువులు, పోలీసులు, రెవెన్యూ, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని రెండు బోట్లతో గాలింపు చర్యలు చేపట్టారు. కొంతసేపటికి సబ్బెళ్ల ఈశ్వర్‌రెడ్డి (20), పెంట జయకుమార్ (19)ల మృతదేహాలు లభ్యమయ్యాయి. అయితే గల్లంతైన సంపత్‌రెడ్డి కోసం చీకటి పడే వరకూ అధికారులు గాలింపు చర్యలు కొనసాగించారు. అయినా ప్రయోజనం లేకపోవడంతో నదీ ప్రవాహానికి వలలు అడ్డంగా కట్టి గాలింపు నిలిపివేశారు. తిరిగి ఆదివారం గాలింపు చేపడతామని సీఐ తెలిపారు. అనంతరం మృతదేహాలను పోలీసులు కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెలు అవిసేలా రోదిస్తూ..

నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి సొంత తమ్ముడు ఈశ్వర్‌రెడ్డి మృతి చెందడం, పిన్ని కొడుకు మరో తమ్ముడైన సంపత్‌రెడ్డి గల్లంతు కావడంతో సత్యనారాయణరెడ్డి సంఘటనా ప్రదేశంలో రోదించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సరదాగా ఈత కోసం వచ్చామని, తనకి ఈత రాకపోవడంతో ఒడ్డునే కూర్చున్నానని, కళ్ల ముందే వారు గల్లంతయ్యారంటూ సత్యనారాయణరెడ్డి గుండెలు అవిసేలా రోదించాడు.

కుటుంబ నేపథ్యాలివీ..

సూర్యనారాయణరెడ్డి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని చిన్న కొడుకు ఈశ్వర్‌రెడ్డి ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ ప్రమాదంలో ఈశ్వర్‌రెడ్డి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని విషాదంలోకి నెట్టేసింది. సెలవుల కోసం విజయనగరం నుంచి వచ్చిన సూర్యనారాయణరెడ్డి భార్య చెల్లెలి కొడుకు సంపత్‌రెడ్డి పదో తరగతి పరీక్ష రాసి వేసవి సెలవుల కోసం రావులపాలెం వచ్చాడు. సంపత్‌రెడ్డి గల్లంతు కావడంతో ఈ విషయాన్ని విజయనగరంలో ఉన్న తల్లిదండ్రులకు ఫోన్లో తెలిపారు. సంపత్‌రెడ్డి తండ్రి దుర్గారెడ్డి అనపర్తి నుంచి ఫైనాన్స్ వ్యాపారం నిమిత్తం విజయనగరం వెళ్లి స్థిరపడ్డాడు. ఉన్న కూతురు, కొడుకులో చిన్నవాడైన సంపత్‌రెడ్డి మృతి చెందడంతో తీవ్రంగా విలపిస్తున్నారు. ఈ ఘటన ఆ రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మరో మృతుడు జయకుమార్ తండ్రి సుబ్రహ్మణ్యం వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సుబ్రహ్మణ్యానికి కూతురు, కొడుకు సంతానం. జయకుమార్ స్థానిక డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతూ ఖాళీ సమయంలో ఫొటో స్టూడియోలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. చేతికి అందివచ్చాడనుకున్న కొడుకు మృతి చెందడంతో ఆ తండ్రి విలపిస్తున్న తీరు అందరినీ కలచి వేసింది.

ఆ ఘటన మరువక ముందే..

ఇటీవల ఆలమూరు మండలం మడికికి చెందిన ముగ్గురు మహిళలు బడుగువానిలంక సమీపంలో గోదావరి దాటుతూ నదీ ప్రవాహానికి ఊబిలో కూరుకుపోయి మృతి చెందారు. ఇది మరువక ముందే రావులపాలెం వద్ద గౌతమి పాత బ్రిడ్జి సమీపంలో ఈ ఘటన జరగడం గమనార్హం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పోలీసులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించాలని అంతా కోరుతున్నారు.

కళ్ల ముందే కొట్టుకుపోయారు: కొమ్మర్తి రాజేష్


ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన కొమ్మర్తి రాజేష్

నలుగురూ కలసి గోదావరిలో స్నానం చేస్తుండగా నదీ ప్రవాహం ఎక్కువ కావడం **తో ముగ్గురు కొట్టుకుపోయారు. నేను అంతా గాలించినా ప్రయోజనం లేకపోవడంతో ఒడ్డుకు వచ్చి ఈ విషయాన్ని అక్కడున్న వారికి చెప్పాను. అయినా** అప్పటికే వారు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారని స్నానానికి దిగి సురక్షితంగా బయటపడిన కొమ్మర్తి రాజేష్ తెలిపాడు. స్నేహితుల మృతితో తీవ్ర కలత చెందుతున్నాడు.

అన్ని దారులూ అన్నవరానికే..


సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను వధూవరులను చేసి పూజలు నిర్వహిస్తున్న పండితులు


స్వామి, అమ్మవార్లను ఎదుర్కోలు ఉత్సవానికి ఊరేగింపుగా తీసుకు వస్తున్న అధికారులు, భక్తులు


రత్నగిరిపై విద్యుత్ దీపాలంకరణ


శుభం కోరుతూ పసుపు దంచుతున్న ముత్తయిదువలు

- కల్యాణ తిలకం దిద్దుకున్న సత్యదేవుడు
- లోక కల్యాణానికి నేడే సుమూర్తం
- 24 వరకూ ఉత్సవాల నిర్వహణ

అన్నవరం: కల్యాణ వీణ మోగింది.. సత్యదేవుని కల్యాణోత్సవాలకు అంకురార్పణ జరిగింది.. సరికొత్త కాంతులతో అన్నవరం సొబగులను అద్దుకుంది.. సత్యదేవుని దివ్య పరిణయోత్సవానికి శుభ సమయం ఆసన్నమవుతున్న వేళ, రత్నగిరి శోభాయమానంగా వెలుగొందుతోంది.. కల్యాణ తిలకం దిద్దుకున్న సత్యదేవుడు, ఆ అమ్మవార్లను చూసిన భక్తజనం మురిసిపోయింది.. కాకినాడ జిల్లాలోని అన్నవరం సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవాలు శనివారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. భక్తవరదుడు, కోరిన కోర్కెలు తీర్చే రత్నగిరివాసుడు సత్యదేవుడే వరుడైన వేళ, సిరులొసంగే అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు వధువైన శుభవేళ రత్నగిరి పులకించింది. వారం రోజులపాటు అంగరంగ వైభవంగా జరుగనున్న శ్రీసత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలకు వైశాఖ శుద్ధ దశమి శనివారం సాయంత్రం రత్నగిరిపై పండితులు శ్రీకారం చుట్టారు.

సీతారాములే పెళ్లి పెద్దలుగా...

రత్నగిరి క్షేత్రపాలకులు శ్రీసీతారాములు పెళ్లి పెద్దలుగా వెంట రాగా, శ్రీసత్యదేవుడు, అమ్మవార్లను సాయంత్రం నాలుగు గంటలకు ఊరేగింపుగా అనివేటి మండపానికి తీసుకు వచ్చారు. అక్కడ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ మండపంలో ప్రత్యేక ఆసనంపై సత్యదేవుడు, అమ్మవార్లను, పక్కనే మరో ఆసనంపై పెళ్లిపెద్దలు సీతారాములను ప్రతిష్ఠించి పండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య స్వామి, అమ్మవార్లను పండితులు పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెను చేశారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం శుభం కోరుతూ ముత్తయిదువలు పసుపు దంచారు. ఈ పూజలను దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠి, గంగాధరభట్ల గంగబాబు, యనమండ్ర శర్మ, చిట్టిశివ, ముష్టి పురుషోత్తం, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యశర్మ, అర్చకులు తదితరులు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను వధూవరులను చేసిన అనంతరం రామారాయ కళావేదికపై సత్యదేవుడు, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం జరిపారు. రాత్రి ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకూ ఈ కార్యక్రమం సాగింది.

నేడు అపురూప ఘట్టం

వైశాఖ శుద్ధ ఏకాదశి ఆదివారం రాత్రి తొమ్మిది గంటల నుంచి సత్యదేవుడు, అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం రత్నగిరిపై ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజాప్రతినిధులకు ఎటువంటి ప్రత్యేకత లేకుండా భక్తులతో పాటు ఆహ్వానించారు. జిల్లా కలెక్టర్ నివాస్, ఇతర ఉన్నతాధికారులను కూడా ఆహ్వానించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు సుమారు 20 వేల మంది భక్తులు విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేశారు. కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించేలా కల్యాణ వేదిక ముందు మండపంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాదం, అక్షతల ప్యాకెట్లను కల్యాణ వేదికకు ఎదురుగా ఉన్న సర్క్యులర్ మండపంతో పాటు పశ్చిమ రాజగోపురం వద్ద మరో నాలుగు చోట్ల పంపిణీ చేయనున్నారు. భక్తులకు అన్నదాన భవనంలో భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తుల వాహనాలను కొండ దిగువ కళాశాల మైదానం వరకే అనుమతిస్తారు. అక్కడి నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా కొండపైకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. 300 మంది పోలీసులతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేశారు. భక్తులకు మంచినీటి సరఫరాకు వలంటీర్లు, సేవా కార్యకర్తలను నియమించారు.

ఏర్పాట్లపై ఈఓ సమీక్ష

ఆదివారం జరుగనున్న సత్యదేవుని కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల ప్రకారం సిబ్బందికి అప్పగించిన బాధ్యతలను నిర్వర్తించాలని ఆదేశించారు. ఉదాసీనంగా వ్యవహరించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

బోధనలో మార్పులను ఆకళింపు చేసుకోవాలి


ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ కృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఆంధ్ర రాష్ట్ర కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులుగా రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాల అధ్యాపకులకు నిర్వహిస్తున్న క్రియేటివ్ ఈ- కంటెంట్ జనరేషన్ శిక్షణ శనివారంతో ముగిసింది. దీనికి కళాశాల ఆర్జేడీ డాక్టర్ చప్పిడి కృష్ణ హాజరై మాట్లాడుతూ ఉన్నత విద్య బోధనా విధానంలో వస్తున్న పెను మార్పులను కళాశాలల అధ్యాపకులు ఆకళింపు చేసుకోవాలన్నారు. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కృత్రిమ మేధ(ఏఐ)ను ఉపయోగించి పాఠ్య ప్రణాళిక రూపొందించి, తదనుగుణంగా విద్యా బోధన సాగించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర.ఆర్‌కే మాట్లాడుతూ డిజిటల్ పద్ధతులను అధ్యాపకులు తమ విద్యా బోధనలో ప్రవేశపెట్టాలన్నారు. ఉన్నత విద్యలో నిన్న, నేడు, రేపు అనే ప్రాతిపదికన వస్తున్న మార్పులను తెలుసుకోవాలన్నారు. ఈ పద్ధతులను ఏఐతో అనుసంధానించి విద్యా బోధన సాగించడంలో ఆర్ట్స్ కళాశాల ముందంజలో ఉందన్నారు. కృత్రిమ మేధ పద్ధతుల్లో ప్రవీణుడు డాక్టర్ సునీల్ మ్యాజిక్ స్కూల్ వంటి సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి పాఠ్య ప్రణాళికను ఎలా రూపొందించాలో వివరించారు. బెంగళూరుకు చెందిన డాక్టర్ నాగేంద్ర పలు అంశాలు వివరించారు. శిక్షణకు బి.వెంకట్రావు సమన్వయకర్తగా, ఏపీసీసీఈకు చెందిన డాక్టర్ జె.జ్యోతి పర్యవేక్షకులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఎన్.శ్రీనివాస్, సంజీవ్ కుమార్, కిరణ్ కుమార్, ప్రవీణ్ అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు 25 నుంచి ఉచిత శిక్షణ


బీసీ స్టడీ సర్కిల్ సంచాలకుడు సత్య రమేష్

అమలాపురం రూరల్: ఈ నెల 25వ తేదీ నుంచి గ్రూప్-2 మెయిన్స్ పరీక్షకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు తూర్పుగోదావరి జిల్లాలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తూర్పుగోదావరి జిల్లా బీసీ స్టడీ సర్కిల్ సంచాలకుడు పిల్లి సత్య రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-2 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ తరగతులతో పాటు ప్రతి సబ్జెక్టుకి ప్రాక్టీస్ టెస్టులు, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామని తెలిపారు. లైబ్రరీ సౌకర్యం, స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రూప్-2 మెయిన్స్ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులు రాజమహేంద్రవరం ఏపీ బీసీ స్టడీ సర్కిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 08832421129, 93939 34825, 86394 47339 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.